# శ్రీరంగ నీతులు

**. యస్. పురుషోత్తమాచార్య.**

'వీల్లేదు! నన్నాట్టే విసిగించకండి!' విసుక్కున్నారు ప్రిన్సిపాల్.

"సార్! మీకెలాంటి ఇబ్బంది రానీకుండా జాగ్రత్త పడతాం! ఈ ఒక్కసారికి పర్మిషన్ ఇవ్వండి!" ఏక కంఠంతో వేడుకున్నారు ఫైనలియర్ విద్యార్థులు.

"ఛఛ! ఇదేం గోల? పరీక్షలో ప్రక్కన దగ్గరకొస్తున్నాయి... చదువుకోండ్రా! అంటూంటే పిక్‌నిక్కనీ, ఎక్స్‌కర్షన్ అనీ ప్రతి రెణ్ణెల్లకోసారి ప్రయాణం కట్టటం! నేను చస్తే ఒప్పుకోను. వెళ్ళండవతలికి!" కరుసుకున్నారు ప్రిన్సిపాల్‌గారు.

"పరీక్షలకింకా రెణ్ణెల్లు టైముంది కదండి? ఆ తర్వాత సెలవులు!... మళ్ళీ మేమంతా కలిసే అవకాశం ఉండదు. అందుకనీ..."

"ఏదయినా కుదరదు! పైగా మగపిల్లలతో ఆడపిల్లల్ని పంపటం నాకసలిష్టం లేదు!"

ప్రిన్సిపాల్‌గారిలోని ఆ కాస్త సడలింపుని గమనించిన విద్యార్థుల్లో ఉత్సాహం కాస్త ఇనుమడించింది.

"సార్! గర్ల్స్ వెంట వాళ్ళ హాస్టల్ వార్డెన్ని పంపించండి! మేం ఆడపిల్లల వంకకూడా చూడం!" నమ్రకంగా పలికేరు విద్యార్థులు.

"కుదరదు! కుదరదు! ఆ వార్డెన్‌ని నేను చస్తే నమ్మను! వెళ్ళండవతలికి!" అంటూ ఫైళ్ళని ముందుకు లాక్కున్నారు ప్రిన్సిపాల్‌గారు.

బయట వరండాలో ఓ వారగా నుంచుని ఇదంతా శ్రద్ధగా గమనించేడు లెక్చరర్ రమణమూర్తి. ఖాళీగా వున్న వైస్‌ప్రిన్సిపాల్ ఉద్యోగానికి దరఖాస్తు పడవేసాడతను. అయితే ఆ ఉద్యోగం రావటానికి కమిటీలో ప్రిన్సిపాల్‌గారు సహకరించాలి. ఆయన్ని ఆకట్టుకుని మద్దతుని సంపాదించటానికి చాలా రోజుల్నుంచీ ప్రయత్నిస్తున్నాడతను. అలా అదనుకోసం చూస్తూన్న అతనికి కాస్త అక్కడ విద్యార్థుల అభ్యర్థనలు కర్ణపేయంగా తోచేయి. ఎక్స్‌కర్షన్ విషయంలో జోక్యం వేసుకుని ప్రిన్సిపాల్‌గారి మెప్పుని పొందాలన్న ఆలోచన కాస్త అతనికి తటాలున స్ఫురించింది.

గబగబా ప్రిన్సిపాల్‌గారి గదివంక నడిచేడతను.

"సార్! ఎన్నాళ్ళని వాళ్ళని మనం కట్టడి చేయగలం? వాళ్ళ ఉత్సాహాన్ని చల్లారిస్తే వారికి చదువుపై ఆసక్తి తగ్గిపోతుంది. దాంతో పరీక్షా ఫలితాలు పడిపోతాయి. అందువల్ల మన కాలేజీకే నష్టం కలిగే ప్రమాదం వుంది!" మెల్లిగా తగలాల్సినచోట తగిలించేడు రమణమూర్తి.

వెనుకంజ వేసేరు ప్రిన్సిపాల్‌గారు.

"అదికాదయ్యా రమణమూర్తీ! వీళ్ళంతా కలిసి వెళితే ఏం ముంచుకొస్తుందో. ఏమో? ప్రతీసారీ ఏదో గందరగోళం!" అంటూ ఆలోచనలో పడిపోయారాయన.

"మీరంగీకరిస్తే ఈసారి వీళ్ళవెంట నేను వెళతాను. నా ముందు వీళ్ళ ఆటలు సాగవ్!" ముందుకొచ్చేడు రమణమూర్తి.

ఓసారి రమణమూర్తి వంక సాలోచనగా చూచారు ప్రిన్సిపాలుగారు. కాని లోగడ ఎక్స్‌కర్షన్ కెళ్ళినప్పుడల్లా ఆకతాయి అమ్మాయిలూ, అల్లరి అబ్బాయిలూ కలిసి వెంట వెళ్ళిన స్టాఫ్ మెంబర్లని వెర్రి వెధవల్ని చేసినట్టి సంఘటనలు కాస్త జ్ఞాపకం వచ్చేయాయనికి. దాంతో సందిగ్ధావస్థలో పడిపోయారాయన.

అది అదునుగా తీసుకున్నారు విద్యార్థులు.

"ప్రిన్సిపాల్ జిందాబాద్! ప్రిన్సిపాల్‌గారు జిందాబాద్!" అంటూన్న నినాదాలతో వారి సమాధానాన్ని ఆశించకుండానే ధైర్యంతో కూడిన ఉత్సాహంతో అక్కడినుంచి కదిలివెళ్ళేరు.

* * *

నాగార్జునసాగర్ గెస్ట్‌హౌస్ ముందు సీతాకోక చిలుకల్లా బస్సు దిగిపోయిన అమ్మాయిల సామాన్లందుకోవటానికి పరిగెత్తేరు కుర్రాళ్ళు.

కాని "స్టాప్‌దేర్!" అన్న రమణమూర్తి గావుకేక వింటూనే ఠక్కున ఆగిపోయేరు.

"ఎవరైనా ఆడపిల్లల వంక వెళ్ళారంటే మర్యాద దక్కదు!"

రమణమూర్తి ఉగ్రాకృతిని చూచిన కుర్రాళ్ళ ఉత్సాహం కాస్తా వెంటనే నీరుకారిపోయింది.

"అమ్మాయిలూ! మీ సామాన్లందుకుని నా వెంట రండి!"

గొర్రెల మందలా రమణమూర్తి వెన్నంటి వెడుతోన్న అమ్మాయిల వంక దిగులుగా చూస్తూ వుండిపోయేరు కుర్రాళ్ళు.


గెస్ట్‌హౌస్‌లోని మొదటి అంతస్తులో మెట్లప్రక్కన ఎడం వాటాలో అమ్మాయిలకీ, కుడివైపున అబ్బాయిలకీ వసతి ఏర్పాటు చేయబడింది. ఆ రెండు వాటాలకీ వెనుకగా కాస్త ప్రత్యేకంగా తనకో గదిని ఏర్పాటు చేసుకున్నాడు రమణమూర్తి.

వరండాకి అటువైపు వాళ్ళు యిటూ, యిటువైపు వాళ్ళు అటూ అడుగు వేయరాదంటూ ఆజ్ఞలు జారీచేసేడు రమణమూర్తి.

ఉదయం టిఫిన్ పూర్తవగానే అంతా ఆనకట్టని చూడటానికి బయలుదేరేరు. ఎంతో సందడిగా వుండాలనుకున్న కుర్రమూక ప్రయత్నాలు కాస్తా కుంటుపడ్డాయి. రమణమూర్తి కాస్తా వారికి సింహస్వప్నమై కూచునిపోయేడు.

ఆడపిల్లలతో కబుర్లతో ఆటపాటలతో సరదాకా కాలక్షేపం చేయొచ్చనన్న కలలన్నీ చెదిరిపోయిన బాధకన్నా ఆ చండశాసనుడికి వత్తాసు పలుకుతున్నట్లుగా అమ్మాయిలంతా తమవంక ముభావంగా వుంటం కుర్రాళ్ళని ఇబ్బందిలో పడవేసింది.

**కుర్రాళ్ళలా కుతకుతలాడిపోతూంటే రమణమూర్తి మాత్రం మీసాలు మెలివేసుకోసాగేడు. కాలేజీ చరిత్రలోనే ఈ రకంగా ఎవరూ ఎక్స్‌కర్షన్‌ని ఇంతగా నిర్వహించలేదని వెంటవచ్చిన కాలేజీ జవాను అతన్ని అందలం ఎక్కించేడు.**





దాంతో వాతావరణం అంతా చప్పబడిపోయింది.

నాగార్జునకొండకి బోటు ప్రయాణంలో కూడా ఆడపిల్లలకీ, కుర్రాళ్ళకీ విడివిడిగా పడవల్ని ఏర్పాటుచేసేడు రమణమూర్తి.

విశాలమైన జలరాశిలో ఒంటరి ప్రయాణం ఆడపిల్లలకి భీతావహంగా తోచింది.

చలనం లేకుండా నిలిచిపోయిన నీటిలో పయనిస్తోన్న పడవలో నిర్వీర్యంగా కూచునిపోయారు కుర్రాళ్ళు.

కొండపైన కూడా అమ్మాయిలకూ, అబ్బాయిలకూ ఎటువంటి పొత్తూ కలక్కుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడు రమణమూర్తి.

మధ్యాహ్నం భోజనం, ఆటపాటలూ అన్నీ కూడా ఇరువర్గాలకీ ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడ్డాయి.

ఎటు చూచినా దిగ్బంధంలా ఉన్న ఆ వాతావరణంలో పద్మవ్యూహంలో చిక్కుకుపోయిన అభిమన్యుడిలా ప్రతి కుర్రాడు గిలగిలలాడిపోయేడు. ఆ పరంగా జనించిన అసంతృప్తిని వారేవిధంగా వ్యక్తంచేసినప్పటికీనీ రమణమూర్తి కించిత్తు కూడా జంకలేదు.

కుర్రాళ్ళలా కుతకుతలాడిపోతూంటే రమణమూర్తి మాత్రం సగర్వంగా మీసాలు మెలివేసుకోసాగేడు. అంతవరకూ కాలేజీ చరిత్రలోనే ఈ రకంగా ఎవరూ కూడా ఎక్స్‌కర్షన్‌ని ఇంత ఇచ్ఛితంగా నిర్వహించలేదని వెంటవచ్చిన కాలేజీ జవాను కాస్తా అతన్ని అందలం ఎక్కించేడు. దాంతో వెన్ను విరుచుకున్నాడతను.

అలా సాయంకాలం దాకా ఇరువర్గాల్నీ కట్టుబాట్ల నెపంతో ఓ సుడిగుండంలో పడవేసి అందులోనుంచి వారిని బయటపడకుండా చూచి అలసి చివరికి తన గదిని చేరి తేలికగా గాలిని పీల్చుకోగలిగేడు రమణమూర్తి. అలా మెల్లిగా కుర్చీలో జారగిలబడిపోయి మర్నాడు ప్రిన్సిపాల్ గారి ముందు తన ప్రతాపాన్ని ఎలా వెల్లడిచేసుకోవాలో అన్న విషయాన్ని పలుమార్లు మననం చేసుకోసాగేడతను. ఇహ రేపటినుంచి తను ఎదురవుతే చాలు! విద్యార్థులు గడగడలాడుతారనే నమ్మకంతో కలిగిన భావోద్రేకం కాస్తా అతన్ని ఆనందంతో కుదిపివేసింది.

రోజంతా కాలి నడకన కొండాకోనలన్నీ తిరిగి రావటంతో కుర్రకారంతా అలసిపోయింది. దాంతో పెందరాళే రాత్రి భోజనం ముగించి ఎక్కడివాళ్ళక్కడే నిద్రలోకి జారిపోయేరు. తనకు ఆకలి లేదంటూ వారితోబాటు భోజనం చేయకుండా తప్పించుకున్నాడు రమణమూర్తి.

గదిలోని ప్రశాంత వాతావరణంలో పచార్లు చేయసాగేడతను. కాని అతని మనసులో మాత్రం

అదో రకమైన అశాంతి చోటుచేసుకోసాగింది. కంటికి నిదురవచ్చే సూచనలు కనిపించలేదతనికి. మనసులో కొనసాగుతున్న సంఘర్షణ పరికట్టే నెపంతో తలుపు తెరచి బయటి వరండా కిరువైపులా దృష్టిని సారించేడతను.

అంతటా మౌనం రాజ్యమేలుతోంది.

ఆవంకా ఈవంకా మరోసారి పరికించి తలుపును దగ్గరగా వేసి కాలింగ్ బెల్ నొక్కేడతను.

రెండు నిమిషాల తర్వాత గెస్ట్‌హౌస్ అటెండర్ లోనికి వచ్చేడు. అతనివంక అదోలా చూచాడు రమణమూర్తి.

అటెండర్ ప్రశ్నార్థకంగా మొహం పెట్టేడు.

''గొంతారిపోతోంది. కాస్త తడి చేసే మార్గమేదన్నా చూడగలవుటోయ్?'' రమణమూర్తి వెకిలి నవ్వు కాస్తా అటెండర్ కర్థమైపోయింది.

పది నిమిషాల తర్వాత గొంతును తడి చేసుకుంటూ అటెండర్ వంక మరోసారి చూచేడు రమణమూర్తి.

''చాలా చలిగా వుందోయ్... కాస్త వేడిని... ఏదన్నా... ఏర్పాటు...''

అటెండర్ చేతికి మరో వంద అందింది.

అరగంట తర్వాత 'వేడి' తలుపు తట్టి లోనికొచ్చి గడియవేసింది.

వెలుపల సద్దు మణిగింది.

అలా తడి... వేడి...ల మేలు కలయికతో లీనమయి తన్మయత్వంలో మునిగితేలుతూన్న రమణమూర్తి కాస్తా పదకొండూ ఆ ప్రాంతంలో తన గది తలుపు నెవరో బాదుతూంటంతో ఉలిక్కిపడి లేచి మంచం దూకేడు.

కిటికీ దగ్గరకు పరిగెత్తి తలుపు తెరిచేతడను.

వెలుపల కాలేజీ అమ్మాయి సునీత నుంచుని వుంది.


కాని ఆ అమ్మాయి కాస్తా కిటికీ గుండా అతడి గదిలోని జుగుప్సాకరమైన వేడి వాతావరణాన్ని గమనించి నిలువూనా వణికిపోసాగింది.

''రోజంతా క్రమశిక్షణ పేరిట పిల్లలమనే విచక్షణకూడా లేకుండా మా సరదాలన్నింటినీ కట్టడి చేసేరు. ఎప్పుడో ఒకసారి మాలో ఏ ఒక్కరో చేసిన ఓ చిన్న పొరపాటుని సాకుగా తీసుకుని అందుకు శిక్షగా మాకందరకూ సంతోషం లేకుండా చేసేరు. మరి మా అందరకూ నైతిక విలువల్ని బోధించవలసిన మీరే ఇప్పుడు చేస్తున్న పనేమిటి?''

నిలదీస్తున్నట్లుగా వున్న సునీత చూపులు కాస్తా రమణమూర్తికి ముచ్చెమటల్ని తెప్పించేయి.

తటాలున కోలుకుంది సునీత.

''సార్! నా గదిలోని సరస్వతికి గుండెనొప్పి వచ్చింది. వెంటనే డాక్టర్ని పిలిపించండి!'' అంటూ వెనుదిరిగి వేగంగా తన గదివంక పరిగెత్తిందా అమ్మాయి. ✱



విషయం

''మన ప్రేమని ఒప్పుకోని మన పెద్దాళ్ళకు దూరంగా ఎక్కడైనా వెళ్ళిపోదాం మోహన్!'' ఆవేశంగా అంది విమల.

''వెళ్దాము. కాని మీ చెల్లిని చూడకుండా నేను బ్రతకలేను ప్రియా!'' అసలు విషయం చెప్పేశాడు మోహన్.

—ముత్యాల వెంకట్
(భద్రాచలం)




Heros' BS-27 TEL